క్లుప్తంగా

11 నుంచి అంతర్ పాఠశాల క్రికెట్ పోటీలు

కోదాడఅర్బన్ : జాతీయ విద్యా దినోత్సవం, బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని కోదాడ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 11, 12 తేదీల్లో కోదాడ పట్టణంలోని కేఆర్ ఆర్ కళాశాల మైదానంలో అంతర్ పాఠశాల క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి సురేష్ గురువారం తెలిపారు. క్రికెట్ ఛాంపియన్ షిప్- 2023 సీజన్- 2కు ఇప్పటికే పేరు నమోదు చేసుకున్న పాఠశాలల క్రికెట్ జట్లు, డ్రా షీటు ప్రకారం నిర్వహణ కమిటీ సభ్యులు క్రీడలకు సకాలంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. 12న క్రీడలు ముగిసిన అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు ఆయన తెలిపారు.

ఆర్థికసాయం అందజేత



బాధితురాలి కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న గ్రామస్తులు

నడిగూడెం : మండలంలోని చెన్నకేశ్వాపురం గ్రామానికి చెందిన పంది మానస గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నది. బాధితురాలు నిరుపేద కావడంతో వైద్య ఖర్చులకు గ్రామస్తులు, బంధువులు, మిత్రులు రూ.2.40 లక్షలు సేకరించి బుధవారం ఆమె భర్త నరేష్‌కు అందజేశారు.

బీఆర్‌ఎస్‌లోకి బీఎస్పీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్



శ్రీనివాస్‌కు పార్టీ కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న నాయకులు

మునగాల : మండలంలోని కలకోవ గ్రామానికి చెందిన బీఎస్పీ మండల శాఖ అధ్యక్షుడు అనంతుల శ్రీనివాస్ ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి తిరిగి సొంతగూడైన బీఆర్‌ఎస్ పార్టీలో గురువారం చేరారు. దీంతో బీఆర్‌ఎస్ పార్టీ గ్రామ అభివృద్ధి కమిటీ సమక్షంలో ఆయనకు నాయకులు పార్టీ కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కొంపెల్లి వీరబాబు, గన్నా నరసింహారావు, మండవ చినసైదులు, సుంకర శ్రీనివాస్, పనస శ్రీనివాస్, మునగలేటి శేఖర్, తొండల లింగయ్య, మునగలేటి నాగయ్య, అమరగాని వీరభద్రం, పనస వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు హుజూర్‌నగర్‌లో సీపీఎం అభ్యర్థి నామినేషన్



మాట్లాడుతున్న కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు మర్రి నాగేశ్వరరావు

నేరేడుచర్ల : హుజూర్‌నగర్ సీపీఎం అభ్యర్థి మల్లు లక్ష్మి ఈనెల 10వ తేదీన నామినేషన్ వేయనున్నారని, పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు మర్రి నాగేశ్వర్‌రావు కోరారు. గురువారం మండలంలోని పెంచికల్‌దిన్నలో గల గ్రామ పార్టీ శాఖ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సమావేశంలో గ్రామ శాఖ కార్యదర్శి శ్రీధర్, బాబురావు, వెంకటేశ్వర్‌రావు, అరిబండి ప్రసాదరావు, రాణమ్మ, సైదమ్మ, రాములమ్మ, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

చంద్ర పుల్లారెడ్డికి నివాళి



పుల్లారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కోదాడఅర్బన్ : కోదాడ పట్టణంలోని లాల్ బంగ్లాలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో చంద్ర పుల్లారెడ్డి 39వ వర్ధంతిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కోటేశ్వర రావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూమి, భుక్తి కోసం పీడిత వర్గ ప్రజల విముక్తి కోసం దీర్ఘకాలిక సాయుధ ప్రజాయుద్ధ పంథాలో సమరం నడిపిన సాహసీకుడు చంద్ర పుల్లారెడ్డి అని కొనియాడారు. ఆయనను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అరుణోదయ జిల్లా అధ్యక్షుడు ఉదయగిరి, ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి వి.నర్సింహారావు, రైతు కూలీ సంఘం నాయకులు సత్యనారాయణరెడ్డి, మురళి, విజయ్, కొండయ్య, మైసయ్య, రామారావు, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

జోరుగా నామినేషన్ల దాఖలు

- హుజూర్‌నగర్‌లో ఉత్తమ్, సైదిరెడ్డితో పాటు నామినేషన్ వేసిన ఏడుగురు
- కోదాడలో కాంగ్రెస్ నుంచి పద్మావతి, జనసేన, సీపీఎం అభ్యర్థులతో సహా తొమ్మిది మంది నామినేషన్

కోదాడ : కోదాడ అసెంబ్లీ స్థానానికి గురువారం తొమ్మిది మంది నామినేషన్లు దాఖలు చేశారు. కోదాడ కాంగ్రెస్ అభ్యర్థి నలమాద పద్మావతి ఉదయం తన నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి సూర్యనారాయణకు అందజేశారు. ఆమె వెంట ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావులు ఆర్వో కార్యాలయంలోకి వెళ్లారు. అదేవిధంగా సీపీఐ(ఎం) అభ్యర్థి మట్టిపల్లి సైదులు, జనసేన అభ్యర్థి మేకల సతీష్‌రెడ్డి, సీపీఎం అభ్యర్థి ఏపూరి సోమయ్య, స్వతంత్ర అభ్యర్థులు సుంకర లింగారెడ్డి, ఇనగుర్తి వెంకటరమణ, కందుల మురళి, కొమ్ము రమేష్, గుణగంటి సైదులు తమ నామినేషన్‌లను దాఖలు చేశారు. ఇప్పటివరకు 25 మంది అభ్యర్థులు 39 సెట్ల నామినేషన్‌లను దాఖలు చేశారు.



కోదాడ : నామినేషన్‌కు ఉత్తమ్, చందర్‌రావుతో కలిసి వెళ్తున్న కాంగ్రెస్ అభ్యర్థి పద్మావతి



హుజూర్‌నగర్ : నామినేషన్ పత్రాలు అందజేస్తున్న ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థి పిల్లుట్ల రఘు

ప్రధాన పార్టీల నామినేషన్లు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ అసెంబ్లీ స్థానానికి గురువారం తొమ్మిది మంది అభ్యర్థులు 12 సెట్ల నామినేషన్‌లు దాఖలు చేశారు. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, ప్రస్తుత ఎంపీ ఉత్తమ్‌కుమార్ రెడ్డి రెండు సెట్ల నామినేషన్లు, బీఆర్‌ఎస్ అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి రెండు సెట్ల నామినేషన్‌లు దాఖలు చేశారు. తమ నామినేషన్ల పత్రాలను అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి జగదీశ్‌రెడ్డికి అందజేశారు. బీఎస్పీ అభ్యర్థి రాపోలు నవీన్ రెండు సెట్ల నామినేషన్ల చొప్పున దాఖలు చేశారు. అలాగే ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థిగా పిల్లుట్ల రఘు, యుగ తులసి పార్టీ అభ్యర్థిగా దేశిగాని సాంబశివగౌడ్ ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ అభ్యర్థి చిలక కిషోర్‌కుమార్ తమ నామినేషన్లు దాఖలు చేశారు. ఇండిపెండెంట్ అభ్యర్థులు పిన్నాని సంపత్ కుమార్, కర్నాటి వెంకటేశ్వరరెడ్డి, చీకూరి లీలావతిలు ఒక్కో సెట్ చొప్పున నామినేషన్‌లను తమ తమ అనుచరులతో కలిసి వచ్చి అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి జగదీశ్‌రెడ్డికి అందజేశారు. కాగా ఇప్పటివరకు 16 మంది అభ్యర్థులు మొత్తం 25 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు.



హుజూర్‌నగర్ : రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు ఇస్తున్న సాంబశివగౌడ్



హుజూర్‌నగర్ : రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు ఇస్తున్న నవీన్



హుజూర్‌నగర్: పత్రాలు అందజేస్తున్న సంపత్‌కుమార్



హుజూర్‌నగర్: నామినేషన్ పత్రాలు ఇస్తున్న లీలావతి

కోదాడలో కాంగ్రెస్ గెలుపు ఖాయం

- కోదాడ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పద్మావతి



పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి పద్మావతి

అనంతగిరి : కోదాడలో కాంగ్రెస్ పార్టీ అత్యధిక మెజార్టీతో గెలవడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ కోదాడ ఎమ్మెల్యే అభ్యర్థి నలమాద పద్మావతిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని లకారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సుమారు ముప్పై మంది గురువారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు శ్రీనివాసరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ బుర్ర సుధారాణి పుల్లారెడ్డి ఆధ్వర్యంలో పద్మావతిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఆమె పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టోలో ప్రస్తావించిన ఆరు గ్యారెంటీ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బుర్ర ప్రమోద్ రెడ్డి, నర్సింహారెడ్డి, గుర్రం వెంకటరెడ్డి, బాణోతు బాబునాయక్, జెడ్పీటీసీ కొణతం ఉమ, సర్పంచ్ కూరపాటి భూపతి, కొణతం శ్రీనివాసరెడ్డి, కబీరు, నాగుల్‌మీరా, తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

కోదాడఅర్బన్ : రాష్ట్రంలో రెండు సార్లు అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ప్రభుత్వం పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలను ఇబ్బందులు పెట్టిందని, గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఘోరంగా విఫలం అయ్యిందని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం కోదాడలోని సీపీఐ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు మేలక శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కోదాడ నియోజకవర్గ జిల్లా కౌన్సిల్ సభ్యుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఐ బలపరుస్తున్న కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని, వారి గెలుపునకు పార్టీ కార్యకర్తలు విస్తృత ప్రచారం చేయాలని కోరారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మండవ వెంకటేశ్వర్లు, షేక్ లతీఫ్, బి.హనుమంతరావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు రాజు, కె.వెంకటయ్య, కోటయ్య, చేపూరి కొండలు, ప్రసాద్, జయప్రద, అలివేలు, వెంకటయ్య, సాయి, అబ్రహం, రాజు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై చర్చకు సిద్ధం

- బీఆర్‌ఎస్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి



మఠంపల్లి : మట్టపల్లిలో పూజలు చేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి సైదిరెడ్డి దంపతులు

హుజూర్‌నగర్ : నియోజకవర్గంలో గత 20 ఏళ్లుగా మీరేం చేశారు, నాలుగేళ్లలో నేనేం చేశానో అభివృద్ధిపై చర్చకు సిద్ధమని హుజూర్‌నగర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి అన్నారు. గురువారం హుజూర్‌నగర్‌లో నామినేషన్ వేసిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. గల్లీలో ఉండే సైదన్న కావాలా, ఢిల్లీలో ఉండే సారు కావాలా ప్రజలు ఆలోచించుకోవాలని చెప్పారు. ప్రతిరోజు మనం జనం మధ్యన ఉంటామని కానీ కాంగ్రెస్ పార్టీ పరిస్థితి అలా కాదని అదొక భూస్వాముల పార్టీ, ఫ్యూడల్ వ్యవస్థ అని అన్నారు. అందుబాటులో ఉండే పిలిస్తే పలికే సైదన్నను గెలిపిస్తేనే న్యాయం జరుగుతుందని ప్రజలందరూ భావిస్తున్నారని ఆయన తెలిపారు. అంతకు ముందు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కాసోజు శంకరమ్మ, జెడ్పీటీసీలు చంద్రకళ, సైదిరెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

మట్టపల్లి ఆలయంలో సైదిరెడ్డి పూజలు

మఠంపల్లి : నామినేషన్ వేసేకంటే ముందు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సైదిరెడ్డి – రజిత దంపతులు మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయం, గుర్రంబోడు తండాలోని శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్ దేవాలయంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పాలక మండలి సభ్యులు కుమ్మరికుంట్ల వెంకటనారాయణ, గుండా కొండల్‌రెడ్డి, ఎంపీపీ పార్వతి, మాజీ ఎంపీపీ కొండానాయక్, సర్పంచ్‌లు విజయలక్ష్మి, ఎం.పార్వతి, మాజీ ఎంపీటీసీలు వెంకటరమణ, నాగునాయక్, పిచ్చయ్య, నాయకులు పాల్గొన్నారు.

మేళ్లచెరువు శివాలయంలో..

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని శ్రీ ఇష్టకామేశ్వరీ సమేత శ్రీ స్వయంభు శంభులింగేశ్వర స్వామి దేవాలయంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సైదిరెడ్డి -రజిత దంపతులు నామినేషన్ పత్రాలు శివుడి ముందు ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట కాసోజు శంకరమ్మ, సర్పంచ్ శంకర్‌రెడ్డి ఉన్నారు.

వైభవంగా నిత్యకల్యాణం

మఠంపల్లి : మండలంలోని మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు గురువారం వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేకార్చనలు, నిత్యహోమం, మూలవిరాట్‌మూర్తికి, పంచామృతాభిషేకం, ఎదుర్కోళ్ల మహోత్సవం చేపట్టారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలంకరణలో కల్యాణతంతు చేపట్టారు. ముందుగా విష్వక్సేనునిపూజ, పుణ్యాహవచనం, రక్షాభందనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగల్యధారణ, తలంబ్రాలతో కల్యాణం నిర్వహించారు. అనంతరం నీరాజన మంత్రపుష్పాలతో మహానివేదన గావించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు, శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

సీపీడీ సెల్ టీమ్ సందర్శన



మాట్లాడుతున్న సీపీడీ అధికారులు

గరిడేపల్లి : మండల కేంద్రం, గడ్డిపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను సీపీడీ సెల్ (నిరంతర వృత్తిపరమైన అభివృద్ధి) టీమ్ గురువారం సందర్శించారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులకు ఏ విధంగా పాఠాలు బోధిస్తున్నారో పరిశీలించారు. ఉపాధ్యాయుల బోధనపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ చత్రు నాయక్, బాలరాజు, రాజేందర్, రాము, గౌతమి, ప్రధానోపాధ్యాయులు నళిని, రవీందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు

హుజూర్‌నగర్ : సీపీఐ నాయకులు మిత్ర ధర్మాన్ని పాటించి కాంగ్రెస్ విజయానికి కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం హుజూర్‌నగర్‌లోని సీపీఐ కార్యాలయంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యల్లావుల రాములు అధ్యక్షతన జరిగిన నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సీపీఐ, కాంగ్రెస్ పార్టీతో రాష్ట్ర వ్యాప్తంగా కుదిరిన పొత్తులో భాగంగా జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలన్నారు. 10వ తేదీన హుజూర్‌నగర్‌లో జరిగే కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ రోడ్ షోలో సీపీఐ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తెల సృజన, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఉస్తెల నారాయణరెడ్డి, ధనుంజయ నాయుడు, పోకల వెంకటేశ్వర్లు, దేవరం మల్లీశ్వరి, అమరారపు పున్నయ్య, సారెడ్డి పాపిరెడ్డి, యల్లావుల రమేష్, దొంతగాని సత్యనారాయణ, చింత్రియాల రవి, ఉప్పతల కోటమ్మ, జడ శ్రీనివాస్, త్రిపురం సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీలో అవినీతిని సహించేది లేదు

- జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సుందరి కిరణ్‌కుమార్



మాట్లాడుతున్న డీఆర్‌డీఓ సుందరి కిరణ్‌కుమార్

గరిడేపల్లి : ఉపాధి హామీ పథకంలో అవినీతికి పాల్పడితే సహించేది లేదని డీఆర్డీఓ సుందరి కిరణ్‌కుమార్ హెచ్చరించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన 13వ విడత సామాజిక తనిఖీలో ఆయన మాట్లాడారు. మండలంలోని 32 గ్రామ పంచాయతీలలో సోషల్ ఆడిట్ టీమ్ అక్టోబర్ 27 నుంచి నవంబర్ 8వ తేదీ వరకు సోషల్ ఆడిట్ గ్రామసభలు నిర్వహించినట్లు తెలిపారు. మండలంలో జూన్ 2021 నుంచి మార్చి 2023 వరకు చేపట్టిన పనులపై సోషల్ ఆడిట్ నిర్వహించినట్లు తెలిపారు. 32 గ్రామ పంచాయతీల పరిధిలో రూ.42వేల 462లు నిధులు ఖర్చు చేసినట్లు చెప్పారు. వీటిలో కూలీల వేతనాలకు రూ. 9 కోట్ల 39 లక్షల 57 వేల 461లు మెటీరియల్ కింద ఒక కోటి 44 లక్షల 85 వేల రూపాయలు ఖర్చు చేసినట్లు తెలిపారు. ఈ నిధులపై సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 32 గ్రామ పంచాయతీలలో 22 గ్రామ పంచాయతీలకు సామాజిక తనిఖీ పూర్తయినట్లు మిగతా 10 గ్రామ పంచాయతీలకు శుక్రవారం తనిఖీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో వచ్చిన ఫిర్యాదులపై సోషల్ ఆడిట్ సభ్యులు సామాజిక తనిఖీల్లో చదివి వినిపించారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి వనజ, అంబుడ్స్‌మెన్ లచ్చిరాం, ప్రవీణ్, రమేష్, ఏపీఓ సురేష్, మహేష్, ఈసీ సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బహుళ ఏకాదశి నక్షత్ర పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : మడంలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి దేవాలయంలో బహుళ ఏకాదశి నక్షత్ర పూజలను గురువారం అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, సహస్రనామ ఫల పుష్పార్చన, సేవాకాలం, అలంకరణ, పంచామృతాలతో అభిషేకం, మంగళాశాసనం, తీర్థప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం దాతలు గుండెబోయిన బాలసైదులు పార్వతి దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ చైర్మన్ గండు సైదులు, కార్యనిర్వాహణాధికారి ఎంపి లక్ష్మణరావు, ఎడవెల్లి చంద్రశేఖర్ కవిత, అర్చకులు హరీష్‌కుమార్‌చార్యులు, యరగాని కిరణ్‌కుమార్ గౌడ్ ఉపేందర్, రమేష్, భక్తులు పాల్గొన్నారు.

బియ్యం అందజేత

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డ గ్రామానికి చెందిన జిల్లా తిరుపతమ్మ, నూకపంగు మైసమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. శుక్రవారం వారిద్దరి దశదిన ఖర్మ కార్యక్రమం ఉండటంతో వారి కుంటుంబ సభ్యులకు 100 కేజీల బియ్యాన్ని సర్పంచ్ షేక్ సలీమారంజాన్ కుమారుడు షేక్ అలీపాషా అందజేశారు. ఎరగాని గోపాల్, నాగలింగం, గ్రామ పెద్దలు ఉన్నారు.

నేలవాలిన పొలాల పరిశీలన



నేరేడుచర్ల : చిల్లేపల్లిలో నేలవాలిన పంటలను పరిశీలిస్తున్న ఏఈఓ నిర్మల



నేరేడుచర్ల పరిధిలో పొలాన్ని పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

నేరేడుచర్ల : మండలంలోని చిల్లేపల్లితో పాటు పలు గ్రామాల్లో అకాల వర్షానికి నెలమట్టం అయిన పంట పొలాలను గురువారం వ్యవసాయ విస్తరణ అధికారిని నిర్మల పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అకాల వర్షం కారణంగా నేలకొరిగిన పంట పొలాలను పరిశీలించి, పూర్తి స్థాయి సర్వే చేసి వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తానన్నారు.

వర్షంతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

నేరేడుచర్ల : అకాల వర్షానికి పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం సూర్యాపేట జిల్లా కమిటీ సభ్యుడు పాదూరి శ్రీనివాస్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రం సమీపంలో వర్షాలకు నేలమట్టం అయిన పంట పొలాలను గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. సాగర్ ఆయకట్టుకు సాగు నీరు రాకపోవడంతో వేల రూపాయలతో బోర్లు, బావులను ఏర్పాటు చేసుకొని పంటలను సాగు చేస్తే వర్షానికి నేలమట్టం అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన వెంట సంఘం నాయకులు కోదమగుండ్ల నగేష్, ఎడ్ల సైదులు, ఏసు, జానీ, మిర్యాల అంజి తదితరులు ఉన్నారు.

వర్షంతో దెబ్బతిన్న వరి పొలాలు

గరిడేపల్లి : మండలంలో బుధవారం రాత్రి కురిసిన వర్షంతో పలుచోట్ల వరి పొలాలు నెలకొరిగాయి. గరిడేపల్లి, పొనుగోడు, కీతవారిగూడెం, అప్పన్నపేట, అబ్బిరెడ్డిగూడెం, లక్ష్మీపురంతో పాటు పలు గ్రామాల్లో కోతకు వచ్చిన వరి పొలాలు ఈదురు గాలులతో కూడిన వర్షంతో దెబ్బతిన్నాయి. దీంతో తీవ్రంగా నష్టం వాటిల్లే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పాలకవీడు మండలంలో..

పాలకవీడు : మండల వ్యాప్తంగా బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కోతదశలో ఉన్న వరి పొలాలు నేలకొరిగాయి. పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని వారు కోరుతున్నారు.



పాలకవీడులో నేలకొరిగిన వరి పొలం



గరిడేపల్లిలో..

ప్రజా న్యాయపీఠాలను ఆశ్రయించడం ఉత్తమం

- సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యామ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యామ్‌కుమార్

హుజూర్‌నగర్ : ప్రజా న్యాయపీఠాలను ఆశ్రయించడం ఉత్తమ మార్గమని సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యామ్‌కుమార్ అన్నారు. గురువారం జాతీయ న్యాయసేవా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక కోర్టు ప్రాంగణంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కక్షిదారులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. సమయం, డబ్బు వృథా కాకుండా న్యాయ స్థానాల ద్వారా తమ సమస్యల పరిష్కారానికి ప్రజా న్యాయ పీఠాలను ఆశ్రయించడం ఉత్తమమని పేర్కొన్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 39 ప్రకారం పౌరులందరికీ సమ న్యాయం అందించవలసి ఉందని చెప్పారు. న్యాయ సేవాధికార చట్టం ద్వారా మహిళలు, బాలికలు, షెడ్యూల్ కులాలు, తెగలు, భవన నిర్మాణ కార్మికులు ప్రకృతి వైపరీత్య బాధితులు, ఏడాదికి రూ లక్ష లోపు ఆదాయం కలిగిన వారు ఉచిత న్యాయం పొందడానికి అర్హులని ఆయన చెప్పారు. కోర్టులో కేసు దాఖలు చేయడానికి ముందే న్యాయసేవా సంస్థాను ఆశ్రయించి ప్రజా న్యాయపీఠంకు దరఖాస్తు చేసుకున్నయితే ప్రతి వాదికి నోటీసులు పంపి సమస్యను పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. జూనియర్ సివిల్ జడ్జి మారుతి ప్రసాద్ మాట్లాడుతూ దేశంలో వివిధ స్థాయిల్లో న్యాయ సేవా అధికార సంస్థలు కక్షిదారులకు మెరుగైన సేవలు అందిస్తూ న్యాయదేవతను ప్రజలకు చేరువ చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు కాల్వ శ్రీనివాసరావు, నట్టే సత్యనారాయణ, రవికుమార్, కె.నర్సింహారావు, ఎం.రాఘవరావు, సైదా హుస్సేన్, వీరయ్య, గోపీనాథ్, వెంకటేష్, శ్రీను, సురేష్, శ్రీనివాసరావు, రేణుకాదేవి, ప్రదీప్తి, రమాదేవి, సిబ్బంది, ప్యారా లీగల్ వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

మిర్చి తోటకు గడ్డి మందు!

- పురుగు మందు దాచిన డ్రమ్ముల్లో గడ్డి మందు కలిపినట్లు అనుమానం
- మందు పిచికారీ చేసిన 12 గంటల్లో వాడిపోయిన తోట
- పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన రైతు



వాడిపోయిన మిర్చి తోట వద్ద బాధిత రైతు

మోతె : మిర్చి తోటకు పురుగు మందు పిచికారీ చేసిన 12 గంటల్లో తోట పూర్తిగా వాడిపోయిన సంఘటన మండల పరిధిలోని రావిపహాడ్ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. బాధిత రైతుల తెలిపిన వివరాల ప్రకారం రావిపహాడ్ గ్రామానికి చెందిన రైతు సంకబుడ్డి వెంకన్న తనకున్న ఎకరం భూమితో పాటు మరో ఎకరాన్ని కౌలుకు తీసుకొని రెండు ఎకరాల్లో మిర్చి తోట సాగు చేశాడు. మంగళవారం మధ్యాహ్నం ఎకరం తోటకు పురుగు, దోమ కాటు నివారణ మందు పిచికారీ చేశాడు. పిచికారీ చేయగా మిగిలిన మందును డ్రమ్ములో భద్రపరిచి బుధవారం ఉదయం మరో ఎకరానికి తోటకు పిచికారీ చేశాడు. అయితే మందు పిచికారీ చేసిన 12 గంటల్లోనే తోట పూర్తిగా వాడిపోయింది. గుర్తు తెలియని వ్యక్తులు డ్రమ్ములో గడ్డి మందు కలపడంతోనే తోట ఎండిపోయిందని రైతు అనుమానం వ్యక్తం చేస్తున్నాడు. మొదట పిచికారీ చేసిన ఎకరం తోటకు ఎలాంటి హానీ జరగలేదని రైతు తెలిపాడు. ఎకరం తోట సాగు చేయడానికి సుమారుగా రూ. 60 వేలు ఖర్చు చేశానన్నాడు. ఈ ఘటనపై మోతె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.

కమనీయం.. శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణం



తాళి చూపుతున్న వేద పండితులు

నేరేడుచర్ల : పట్టణంలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రీదేవి భూదేవి సమేతా శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు ఇరువంటి శ్రీనివాసశాస్త్రి, వేద పండితులు ఇరువంటి శ్రీపాదశర్మ, సంతోష్, విష్ణుమూర్తులు వేద మంత్రాలతో సుప్రభాత సేవ, పంచామృత అభిషేకం, లక్ష పుష్పార్చనతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు మహా అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు పాల్వాయి శ్రీనివాస్‌రావు, పాల్వాయి రమేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ నాగండ్ల శ్రీధర్, ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు రాచకొండ రాంమోహన్‌రావు, వనిత క్లబ్ అధ్యక్షుడు వీరవల్లి శ్రీలత, భాగ్యలక్ష్మి, కందిబండ శ్రీనివాస్‌రావు, సుధాకర్, మాశెట్టి లక్ష్మయ్య, నటరాజ్, వెంకన్న, కిశోర్, కట్ట గణేష్, పుల్లయ్య, భక్తులు ఉన్నారు.

అయ్యప్ప మాలధారులకు అన్నదానం

మునగాల : మండల కేంద్రం శివారులో గల శ్రీహరిహరసుత అయ్యప్పస్వామి దేవాలయం ఆవరణలో గురువారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో 225 మంది అయ్యప్ప మాలధారులు పాల్గొన్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ తడకమళ్ల శ్రీనివాసాచారి గురుస్వామి తెలిపారు. అన్నదానానికి పెద్దోజు గణేష్- సాయిపూజిత దంపతులు 50 కేజీల బియ్యం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు వల్లోజు వెంకన్న, కుందూరు పుల్లారెడ్డి, తంగెళ్ల సాంబ, బొబ్బిలి సంజీవరెడ్డి, కొమ్ము ఈదారావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ తిరుమల నర్సింగ్ కాలేజ్ - కోదాడలో B.Sc నర్సింగ్ కోర్సులలో ప్రవేశానికి దరఖాస్తులు

2023 TS ఎంసెట్ మరియు నీట్ రాసిన వారికి ఎంసెట్ మరియు నీట్‌లో ర్యాంక్ రాకపోయినా మరియు జీరో మార్కులు వచ్చిన శ్రీ తిరుమల నర్సింగ్ కాలేజీలో అడ్మిషన్స్ ఇవ్వబడును. అడ్మిషన్స్ కావలసిన వారు ఈ క్రింది నంబర్స్‌కు మరియు అడ్రస్‌ను సంప్రదించగలరు.

అడ్మిషన్స్ చివరి తేది : 12.11.2023

ఇట్లు/- చైర్మన్ : డా॥ కె. శ్రీపతి రెడ్డి, MBBS
శ్రీ తిరుమల నర్సింగ్ అండ్ పారామెడికల్ కాలేజ్ – కోదాడ,
శ్రీ తిరుమల హాస్పిటల్ – కోదాడ,
ప్రమీల శ్రీపతి ప్లాజా, మెయిన్ రోడ్, కోదాడ. 9603366200